క్లుప్తంగా

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గండేపల్లి: మురారి కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కనుమ రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించారు.

ముగిసిన సత్తెమ్మ తల్లి జాతర

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లి గ్రామ దేవత సత్తెమ్మతల్లి జాతర మంగళవారంతో ఘనంగా ముగిసినట్టు వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు మలిరెడ్డి పాపారావు తెలిపారు. భోగి రోజు ప్రారంభమైన ఈ జాతర సందర్భంగా గ్రామస్తులు, యువకుల ఆధ్వర్యంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆంధ్రా శబరిమలలో మకర జ్యోతి దర్శనం

శంఖవరం: సిద్ధివారిపాలెంలో ఉన్న ఆంధ్రా శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధిలో భక్తుల దర్శనం కోసం మకర జ్యోతి దర్శనం కల్పించారు. వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు, దీక్ష పూర్తి చేసుకున్న అయ్యప్ప భక్తులు సోమవారం ఆలయానికి వచ్చి, దర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీను ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది సంక్రాంతి రోజున భక్తులకు మకర జ్యోతి దర్శనం కల్పిస్తున్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో స్వామివారికి అభిషేకాలు, కుంకుమ పూజలు, పుష్ప అలంకరణతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు కొండల శివారున మకర జ్యోతి దర్శనం కల్పించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న త్రిమూర్తిస్వామి

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరంలో లోవసూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మందికి దుప్పట్లు, ఆహార ప్యాకెట్లను సంస్థ చైర్మన్, సిటీ కేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తి స్వామి మంగళవారం పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులు చోడిశెట్టి లోవరాజు, సూర్యకాంతం జ్ఞాపకార్థం వృద్ధులకు దుప్పట్లు, భోజనాలు అందించామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించనున్నట్టు తెలిపారు.

మద్యం కలిగి ఉన్న ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, నిందితుడితో సెబ్ సీఐ అశోక్

ప్రత్తిపాడు: మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేసి, 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం దాడులు నిర్వహించామన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం పంచాయతీ శివారు కిత్తమూరిపేటలో ఉగ్గిన నాగమణి, ఏలూరు గ్రామంలో కోట అప్పారావును అదుపులోకి తీసుకుని, ఒక్కొక్కరి నుంచి డ్యూటీ పెయిడ్ లిక్కర్ 13 వంతున 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ అశోక్ తెలిపారు.

గుండాటలపై పోలీసుల దాడులు



గొల్లప్రోలు మండలం కొడవలిలో గుండాట శిబిరాన్ని తొలగిస్తున్న పోలీసులు

పిఠాపురం: వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గుండాటలపై క్రైం డీఎస్పీ ఎస్ రాంబాబు, పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. గుండాటలు ఆడేవారిని అదుపులోకి తీసుకుని, పోలీసు స్టేషన్‌కు తరలించారు. సంప్రదాయబద్ధంగా కోడిపందేలు మాత్రమే నిర్వహించుకుంటామని స్థానికులు కోరడంతో, వాటికి అనుమతి ఇచ్చారని, అనుమతి లేని జూదాలు ఆడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



ప్రత్తిపాడు ఎన్‌హెచ్‌పై కొలువైన పాదాలమ్మ అమ్మ వారు



పాదాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పెద్దిపాలెంలో పూజలకు పశువులను సిద్ధం చేస్తున్న రైతులు



ఏలేశ్వరంలో గంగిరెద్దుల వారి సందడి

వెలుగులు నింపిన సంక్రాంతి

- పల్లెల్లో ముగిసిన పెద్ద పండగ
- బంధువుల రాకతో ఇళ్లల్లో సందడి
- అల్లుళ్లతో సరికొత్త శోభ
- తెలుగు సంప్రదాయానికి అద్దం పట్టిన గ్రామాలు

ప్రత్తిపాడు: పల్లెల్లో పెద్ద పండగ ముగిసింది. ఏ లోటుపాటు రానీయకుండా పల్లెవాసులంతా సంక్రాంతిని ఘనంగా జరుపుకొన్నారు. పిండివంటలు, బంధువుల రాకపోకలు, పెద్దలకు నూతన వస్త్రాలు పెట్టడం, పిల్లాపాపల సందడి.. ప్రతి లోగిలిని మెరిపించాయి. కొత్త అల్లుళ్లతో ఇళ్ల సరికొత్త శోభను సంతరించుకున్నాయి. బసవన్నలను, హరిదాసులను ఆహ్వానించి పల్లెవాసులు నజరానాలిచ్చారు. కొత్త ధాన్యంతో చేసిన అటుకుల వంటకాలను ఇంటింటా ఆరగించారు. కనుమ నాడు పాడి పశువులకు ముస్తాబు చేసి, పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు ఉపాహారాలు పెట్టారు. సంక్రాంతి సందర్భంగా మారుమూల గ్రామాల్లో కోడి పందేలు, జూదాలు మామూలుగానే సాగాయి.

ఘనంగా పాదాలమ్మ ఉత్సవం

జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద ఉన్న పాదాలమ్మ అమ్మవారి ఉత్సవాలు కనుమ రోజునే ప్రారంభమవుతాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ యాళ్ల విశ్వేశ్వర రావు మంగళవారం ప్రారంభించారు. ఉదయం నుంచి పాదాలమ్మ అమ్మవారిని భక్తులు దర్శించి, మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద భక్తులు పోటెత్తారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లోని ప్రత్తిపాడు, ధర్మవరం, ఏలూరు, చిన శంకర్లపూడి, టి.రాయవరం, చిన్నింపేట, సిరిపురం, పెద్దనాపల్లి, వేలంక, జగపతినగరం, కిర్లంపూడి తదితర గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తుల రద్దీ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



జి.కొత్తపల్లి గ్రామంలో సంచరిస్తున్న హరిదాసు

గ్రామగ్రామాన సందడే సందడి

ఏలేశ్వరం: తెలుగు వారి సంక్రాంతి వేడుకలు గ్రామగ్రామాన వైభవంగా జరిగాయి. చుట్టుపక్కల గ్రామాలతో పాటు, ఏజెన్సీ నుంచి అనేక మంది ఏలేశ్వరం తరలిరావడంతో రోడ్లన్నీ కిటకిటలాడాయి. సినిమా థియేటర్లు ప్రేక్షకులతో నిండిపోయాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. అత్తారింటి వద్ద కొత్త అల్లుళ్ల రకరకాల పిండివంటల రుచి చూశారు. పెద్దలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వాయనాలను బ్రహ్మణులకు దానం చేశారు. పట్టణంలోని బాలాజీచౌక్ వద్ద సందడి నెలకొంది. ఎప్పటిలాగే ఈ సంక్రాంతికీ కోడి పందేలు నిర్వహించారు.

ఘనంగా కనుమ వేడుకలు

ఏలేశ్వరం: సంక్రాంతితో పాటు విశిష్టమైన కనుమ పండగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సత్యనారాయణ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. పల్లపువీధి, మార్కెట్‌వీధి, బాలా జీచౌక్, నర్సీపట్నంరోడ్ తదితర ప్రాంతాల మీదుగా ఊరేగింపు కొనసాగింది. పెద్దనాపల్లిలో కనుమ పండగను పురస్కరించుకుని పుంగనూరు ఆవులకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రత్యేక పూజలు చేశారు.



గోకవరంలో ఆవులకు పూజలు చేస్తున్న దృశ్యం



గజ్జనపూడిలో తాడి పెద్దుతో ఆడుతున్న తప్పెటగుళ్ల కళాకారులు

కె.నాయకంపల్లిలో సంక్రాంతి సందడి

గండేపల్లి: సంక్రాంతి సందర్భంగా కె.నాయకంపల్లిలో మంగళవారం సందడి నెలకొంది. గ్రామానికి చెందిన ఆడపడుచులు, కొడుకులు, కోడళ్లు తదితరులు విద్య, ఉద్యోగ, వ్యాపార, వివిధ రంగాల్లో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వీరంతా ఏటా సంక్రాంతి పండగకు తమ సొంత గ్రామానికి చేరుకుని, మూడు రోజులూ సరదాగా గడపడం కొన్నేళ్ల నుంచి ఆనవాయితీగా వస్తోంది. భోగి రోజు ముగ్గుల పోటీలు, సంక్రాంతి రోజు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, కనుమ రోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత 2017 నుంచి మొదలైన ఆయా కార్యక్రమాల వివరాలను కేఎన్‌పీవీడీఏ (కొత్త నాయకంపల్లి విలేజ్ డవలపింగ్ అసోసియేషన్) యువకులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

పెద్దలకు వస్త్రాల సమర్పణ

శంఖవరం: మండలవ్యాప్తంగా సంక్రాంతి వేడుకలు వైభవంగా జరిగాయి. పెద్దలకు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. కనుమ రోజు పాడి పశువులను పూజించారు. గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మహిళలు రంగవల్లుల పోటీల్లో పాల్గొన్నారు. హరిదాసులు, గంగిరెద్దు, తప్పెటగుళ్ల కళాకారులతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి మూడు రోజుల పండగ మంగళవారం ముగిసింది.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తొండంగి: మండలంలో సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఉద్యోగ, వ్యాపార, వృత్తి రీత్యా దూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా స్వగ్రామాలకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి, ఆనందంగా గడిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తొండంగి, వేమవరం తదితర గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

పాడి పశువులకు పూజలు

గోకవరం: కనుమ పండగను మండల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. రైతులు తమ పాడి పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఇంటిల్లిపాది కలిసి ఆటపాటలతో సందడి చేశారు.

గ్రామాల్లో ఘనంగా సంబరాలు

ప్రత్తిపాడు రూరల్: సంక్రాంతి సంబరాలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. పెద్దలకు నూతన వస్త్రాలను సమర్పించారు. అల్లుళ్లు, కుమార్తెలు, బంధువులతో ప్రతి ఇంటా సందడి కనిపించింది. మంగళవారం కనుమ పండగను గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. హరిదాసులకు బియ్యం, సామగ్రి వితరణ చేశారు. తప్పెట గుళ్ల కళాకారులు తాడిపెద్దుతో గ్రామాల్లో సువారాట ఆడారు. పాడి పశువులు, ఎడ్లకు ప్రత్యేక పూజలు జరిపి, అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. ఇళ్ల ముంగిట వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

జోరుగా కోడి పందేలు

కిర్లంపూడి: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలో పలుచోట్ల కోడి పందేలు జోరుగా నిర్వహించారు. గోనేడ, వేలంక, కిర్లంపూడి, బూరుగుపూడి, వీరవరం, సోమవరం, తామరాడ, భూపాలపట్నం, గెద్దనాపల్లి గ్రామాల్లో మంగళవారం కూడా కోడి పందేలు జోరుగా సాగాయి. పందేలను చూసేందుకు స్థానిక, పరిసర గ్రామాల నుంచి జనం భారీగా తరలివచ్చారు.

ఘనంగా బాప్టిస్ట్ సంఘాల వార్షికోత్సవం



మహాసభ ప్రతినిధులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

తుని: ఉత్తర సర్కారుల బాప్టిస్ట్ సంఘాల 69వ వార్షికోత్సవ మహాసభలు, సీబీఎం చర్చి 150 ఏళ్ల పండగ ఘనంగా నిర్వహించారు. మంగళవారం తుని స్కాట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో మహాసభల అధ్యక్షుడు డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు జరిగాయి. మహాసభలో నూతన కార్యవర్గం ఎన్నిక, సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణపై చర్చించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఎ.ఫ్రాంక్లిన్ సుకుమార్‌ను మహాసభ ప్రతినిధులు అభినందించారు. మహాసభల్లో అవనిగడ్డ నుంచి సోంపేట వరకున్న 200 సంఘాలకు చెందిన 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభ ప్రతినిధులను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహాసభ కార్యదర్శి, కోశాధికారి కె.కన్నారావు, జి.జోషఫ్, ఎస్ఎంబీ చర్చి అధ్యక్షుడు దల్లి శ్యాంసన్, కార్యదర్శి బి.పాల్ రమేష్, కోశాధికారి ఎ.మోషే, డికన్ బోర్డు చైర్మన్ బీజేవీ ప్రసాద్, సంఘ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ప్రధానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎం కిరణ్‌కుమార్

తుని: ఆర్టీసీ ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా బస్సులను నడపాలని తుని డిపో మేనేజర్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ స్థానిక డిపో ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. మాసోత్సవాలు వచ్చే నెల 14 వరకు కొనసాగుతాయన్నారు. ఏఎంటీ జీజీవీ రమణ, గ్యారేజ్ ఇన్‌చార్జి ప్రసాద్, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సు : ఈ నెల 17న హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు డీఎం ఎస్.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తుని డిపోలో బుధవారం రాత్రి 7.30కు అల్ట్రా డీలక్స్ (90489) సర్వీసు బస్సు బీహెచ్ఈఎల్ (హైదరాబాద్) బయలుదేరుతుందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం ఉందన్నారు.

సర్వదేవతా స్వరూపం గోమాత

బోట్‌క్లబ్: నగరంలోని పలు ఆలయాల్లో మంగళవారం గోపూజ వైభవంగా నిర్వహించారు. పశువుల పండగగా ప్రసిద్ధిగాంచిన కనుమ రోజున గోమాతను పూజిస్తే సకల సుఖాలు లభిస్తాయనే ఉద్దేశంతో ఈ పూజలు నిర్వహించారు. దీంతో ఉదయం నుంచి ఆలయాల వద్ద సందడి నెలకొంది. గోమాత సర్వ దేవతా స్వరూపమని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ పెద్ది రత్నాజీ అన్నారు. గోపూజలో భాగంగా ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. గోసేవ చేసే వారికి గ్రహదోష నివారణ, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. గోసేవ, గోదానం సర్వపాప హరణమన్నారు. దేశం, వంశం, కుటుంబం అభివృద్ధి జరగాలంటే గో సంరక్షణే తక్షణ కర్తవ్యమన్నారు. గోమయం, గోమూత్రం ఇవన్నీ కూడా యావత్ మానవాళికి ఆరోగ్యకరమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హిందూ సాంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. స్థానిక భానుగుడి అయ్యప్పస్వామి ఆలయంలో గోపూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పండితులు ఈ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ గోవును పూజిస్తే సకల దేవతలను పూజించినట్లే అన్నారు. దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో గోపూజ నిర్వహించారు.



బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో గోపూజ చేస్తున్న అధికారులు, పండితులు

రత్నగిరిపై ఘనంగా గోపూజోత్సవం

సత్యదేవుడు, అమ్మవారికి, గోవులకు ఘనంగా పూజలు

అన్నవరం: కనుమ పండగ సందర్భంగా మంగళవారం రత్నగిరి సత్యదేవుని సన్నిధిన, కొండ దిగువన గోశాలలో గోపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పల్లకీలో ఉంచి, ఊరేగింపుగా తూర్పు రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ పల్లకీలోని స్వామి, అమ్మవార్లకు పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర పూజ, శ్రీకృష్ణుడికి సహస్రనామ పూజ నిర్వహించారు. తర్వాత గోవు వృష్ఠ భాగానికి దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ దంపతులు పూజలు చేశారు. అనంతరం గోవు చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి, వాటికి బియ్యం, బెల్లం తినిపించారు. తర్వాత గోవులకు హారతి ఇచ్చారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్లకు నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గోపూజ, ఇతర కార్యక్రమాలను దేవస్థానం వేద పండితులు గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ ఘనాపాఠీ, శివ ఘనాపాఠీ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహం, కోట సుబ్రహ్మణ్యం కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు అంగర సతీష్‌శర్మ, పాలంకి పట్టాభి తదితరులు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నగిరి సప్త గోకులంలోని గోవులకు కూడా అర్చకుడు యడవిల్లి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లతో పాటు సప్త గోకులంలో గోవులను కూడా దర్శించి పూజలు చేశారు. రిసెప్షన్ ఏఈఓ, పీఆర్ఓ డీవీఎస్ కృష్ణారావు, ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సత్యదేవుడు, అమ్మవార్లకు పూజలు చేస్తున్న ఈఓ రామచంద్రమోహన్ దంపతులు



గోవుకు పూజ చేస్తున్న అర్చకుడు



గోశాలలో ఉన్న గోవులు

గోశాలలో.. సాయంత్రం ఐదు గంటలకు గోశాలలో కూడా గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రామచంద్రమోహన్ గోవులకు పూజలు చేసి, పిండి వంటలు, అరటిపండ్లు తినిపించారు. గోసంరక్షణపై అక్కడి సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

మకర జ్యోతి దర్శనం



నాగులపల్లిలో అయ్యప్ప స్వామి అలయం

కొత్తపల్లి : అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం పరమ పవిత్రమని భక్తులు భావిస్తున్నారు. స్థానికంగా ఉన్న ధర్మశాస్తా, నాగులపల్లిలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనాన్ని ఏర్పాటు చేశారు. స్వామివారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం స్వామికి ఆభరణాల అలంకరణ, అనంతరం జ్యోతి దర్శనం ఏర్పాట్లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

స్కోచ్ అవార్డు సెమీ ఫైనల్‌లో పిఠాపురం

పిఠాపురం: స్కోచ్ అవార్డుల్లో పిఠాపురం మున్సిపాలిటీ సెమీ ఫైనల్‌కు చేరినట్టు మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి తెలిపారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇవ్వనున్న స్కోచ్ అవార్డుల్లో పిఠాపురం మున్సిపాలిటీ చెత్త సేకరణ, వినియోగం, పరిశుభ్రత తదితర విభాగాల్లో సెమీ ఫైనల్‌కు చేరినట్టు చెప్పారు.

వైభవంగా సత్తెమ్మ తల్లి సంబరం

పెద్దాపురం: స్థానిక జగ్గంపేట రోడ్డులోని సత్తెమ్మ తల్లి సంబరాన్ని మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. భారీ విద్యుద్దీపాలతో స్థానిక పెట్రోల్ బంక్ సెంటర్ నుంచి ఎన్‌టీఆర్ నగర్ వరకు భక్తులు క్యూలో గంటల తరబడి నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సంబరాన్ని నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, కళ దంపతులు ప్రారంభించగా ఆలయ నిర్వాహకులు పప్పుల నాగరాజు ఆధ్వర్యంలో పప్పుల పెదబాబు భక్త బృందం వేద పండితుల మంత్రాల మధ్య పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనన్నారు. ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామనని హామీ ఇచ్చారు.

మంచు పరదా మాటున..



మంచు తెరల్లో ప్రత్తిపాడు ఇందిరా కాలనీ

రెండు రోజులుగా గ్రామాలను మంచు కప్పేస్తోంది. ఉదయమైనా సూర్యుని జాడ లేకుండా, పొగమంచు ముంచేస్తోంది. ఉదయం ఏడు గంటలు దాటితేనే సూర్య కిరణాలు పుడమిని తాకుతున్నాయి. –ప్రత్తిపాడు